వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

కామారెడ్డి, జూలై 8 : వనమహోత్సవ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయాల కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 17 లక్షల 88 వేల మొక్కలను వనమహోత్సవ కార్యక్రమంలో నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామని, ఇందుకు తగ్గట్లు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి శాఖ వారు ఇచ్చిన టార్గెట్‌ను తప్పకుండా పూర్తి చేయాలని, అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, హాస్టల్స్ మొక్కలు నాటించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఫారెస్టు, మున్సిపల్, గ్రామీణ అభివృద్ధి శాఖ వారి నర్సరీల నుంచి పొడవాటి మొక్కలను ఎంపిక చేసిన ప్రాంతాలకు తీసుకెళ్లి నాటాలన్నారు. అలాగే అవెన్యూ ప్లాంటేషన్ సైతం ఆకర్షించేలా పచ్చదనం సంతరించుకునేలా మొక్కలను ఎంపిక చేసుకొని నాటాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో చందర్, డీపీవో శ్రీనివాసరావు, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో బీటీ రోడ్డుపైకి వస్తే చర్యలు

కామారెడ్డి, జూలై 8 : ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో బీటీ రోడ్లపైకి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సింధుశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్లను కేజ్ వీల్స్‌తో బీటీ, సీసీ రోడ్లపై నడపడంతో రోడ్లు పాడవుతున్నాయని, రోడ్లపై కేజ్ వీల్స్‌తో నడిపే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంతో వ్యయంతో ప్రజలకు మెరుగైన ప్రయాణం కోసం రోడ్లను ఏర్పాటు చేసిందని, కొందరు ట్రాక్టర్ యజమానులు పొలాల్లో పని చేయడానికి కేజ్ వీల్స్‌ను రోడ్లపై నడపడంతో అవి ధ్వంసం అవుతున్నాయని తెలిపారు. రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్ యజమానులపై మోటారు వాహన చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

బీబీపేట్, జూలై 8 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ నాగేశ్వర్‌రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఎన్ని కేసులు ఉన్నాయని అడిగి తెలుకుని వాటిని పరిష్కరించాలని ఎస్సైని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట భిక్కనూర్ సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ప్రభాకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాలను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి, జూలై 8 : కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో నెలకొన్న సమస్యలు, తరగతి గదులు, హాస్టల్ వసతులు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల చుట్టుపక్కల ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. తాగునీటి సౌకర్యం కూడా అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్లు రవీందర్, పర్వేజ్, జవాన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ అధికారికి సన్మానం

భిక్కనూరు, జూలై 8 : ఎన్‌సీసీ ప్రథమ అధికారిగా నియమితులైన అనిల్ కుమార్‌ను పూర్వవిద్యార్థులు సన్మానించారు. మండలంలోని పెద్దమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ అధికారిని 2007–2008 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మెజీషియన్ సంతోష్, జంగబోయిన నర్సింహులు, గోపి, రమేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార సమావేశం

నస్రుల్లాబాద్, జూలై 8 : మండల కేంద్రంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఈ అరవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 114 ఫిర్యాదులు

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జూలై 8 :ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రధానంగా విద్య, వైద్య, బీసీ, గిరిజన సంక్షేమం, విద్యుత్, పంచాయతీ, పింఛన్లు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, డబుల్ బెడ్రూం తదితర అంశాలకు సంబంధించి 114 వినతులను స్వీకరించామని తెలిపారు. ప్రజావాణితోపా టు సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో స్థానికి సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివా స్‌రెడ్డి, ఆర్డీవో చందర్, డీపీవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు దయానంద్, వరదారెడ్డి, భాగ్యలక్ష్మి, కలెక్టర్ కార్యాలయ ఏవో మసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట్, జూలై 8 : రాజంపేటలోని తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారుల సమక్షంలో ప్రజల నుంచి రెవెన్యూకు సంబంధించిన మూడు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, పశువైద్యులు అనిల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'దూషిస్తున్న వారిపై 'పీడీ' కేసు పెట్టండి'

దోమకొండ, జూలై 8 : తమను అసభ్యకరమైన పదజాలంలో దూషిస్తూ.. చంపుతామని బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని తహసీల్దార్ సంజయ్ రావుకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన ఊరడమ్మ గల్లీ ప్రాంత మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమకొండ గ్రామం ఊరడమ్మ గల్లీలో ఓ కుటుంబానికి చెందిన పలువురు కాలనీ వాసులను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఆ కుటుంబానికి చెందిన వారిపై ఇది వరకే పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇంట్లో మారణాయుధాలు ఉన్నాయని, చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ట్లు తెలిపారు. వారి ని తక్షణమే అరెస్ట్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని కాలనీ వాసులకు రక్షణ కల్పించాలని కోరారు. అందుకుగాను వారు దూషిస్తూ మాట్లాడిన సీసీ టీవీ పుటేజీలను తహసీల్దార్‌కు అందజేసినట్లు తెలిపారు. వారి వెంట గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కి ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

బాన్సువాడలో భారీ వర్షం

బాన్సువాడ, జూలై 8 : బాన్సువాడలో ఆదివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. రాత్రి మొదలైన వర్షం రెండు గంటలపాటు జోరుగా కురిసింది. దీంతో పంట పొలాల్లో నీరు చేరింది. బాన్సువాడ మండలం కొల్లూర్ గ్రామంలో అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల కింద నాట్లు వేసేందుకు సిద్ధమైన రైతులకు రాత్రి కురిసిన వర్షం మేలు చేకూర్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కామారెడ్డి రూరల్, జూలై 8 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా నాయకులు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారతీయ విద్యార్థి మోర్చా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడు అర్బాస్‌ఖాన్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులకు రావాల్సిన బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.70 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే విడుదల చేయాని, లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు కళ్యాన్, కార్తిక్, తిరుపతి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

గాంధారి, జూలై 8: మండలంలోని బీర్మల్ తండాలో విద్యుత్ షాక్‌తో ఓ ఆవు మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. తండాలోని బస్సీ నర్సోడ్ అనే రైతుకు చెందిన ఆవు సోమవారం ఆవుల మందతో కలిసి మేత మేయడానికి వెళ్తుండగా, గ్రామ పంచాయతీ బోరు మోటర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. తన కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరాడు.

ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలి

మొక్కను నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జూలై 8 : పట్టణంలోని జిల్లా యోగా భవన్ ఆవరణలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి వనమహోత్సవంలో భాగంగా సోమవారం మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో ప్రజలకు కావాల్సిన ఆక్సిజన్ లభిస్తుందని అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని చెప్పారు. మొక్కలు నాటే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యోగా సభ్యులు రాం రెడ్డి, రఘుకుమార్, సిద్ధాగౌడ్, లక్ష్మారెడ్డి, మోహన్ రెడ్డి, కౌన్సిలర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తకుండా చూడాలి

బోరుబావుల వద్ద విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తకుండా చూడాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి విద్యుత్ శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలంలో పట్టణం, గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల అసలైన లబ్ధిదారులకు లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌కు ఘన నివాళి

ఎల్లారెడ్డి రూరల్/బాన్సువాడ/నస్రుల్లాబాద్, జూలై 8: ఎల్లారెడ్డి పట్టణంలోని వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి ఏపీ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలను నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నాగం పరంధాములు, హఫీజ్‌పటేల్, చిరంజీవులు, కాశీరాం, లింబ్యానాయక్, యూనుస్, బాబ్యానాయక్, బాల్‌కిషన్ పాల్గొన్నారు. బాన్సువాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, బీర్కూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి బస్వరా జ్, అబ్దుల్ అహ్మద్, బ్రహ్మయ్య, నారాయణ, సాయిలు, సురేశ్ తదితరు లు ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి, జూలై 8 : తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం యొక్క ఇంటింటా ఇన్నోవేటర్ 2024 కార్యక్రమాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. తమ ఆలోచనలకు అనుగుణంగా తయారు చేసిన ప్రాజెక్ట్ విషయాలను ఆగస్టు 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించింది.

చోరీకి యత్నించిన ఒకరికి జైలుశిక్ష

ఎల్లారెడ్డి రూరల్, జూలై 8: దొంగతనానికి యత్నించిన ఒకరికి ఐదు నెలల జైలుశిక్ష విధించినట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ద్యావల్ల మీనా అనే మహిళ ఇంట్లో అదే గ్రామానికి చెందిన గొడ్డండ్ల పోలు దొంగతనానికి యత్నించగా.. పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ చేపట్టిన అనంతరం ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ ముద్దాయికి ఐదు నెలల జైలుశిక్ష విధించి నిజామాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పోలుపై ఇప్పటికే పలు చోరీ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

కేబుల్ వైర్ చోరీ

లింగంపేట, జూలై 8: వ్యవసాయ బోరుబావుల వద్ద నుంచి కేబుల్ వైర్ చోరీకి గురైనట్లు రైతు అబ్బుషేర్ ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై రంగారావు సోమవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదుగురు రైతులకు చెందిన వ్యవసాయ బోరు బావుల వద్ద కేబుల్ వైర్ అపహరణకు గురైనట్లు ఏఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

రామారెడ్డి, జూలై 8: మండలంలోని పోసానిపేట్ జంక్షన్‌వద్ద బైక్ అదుపు తప్పి ఒకరు మృతి చెందారు. స్థానిక ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండల శివంవారి పల్లె గ్రామానికి చెందిన గంజారపల్లి అనిల్(45) మేస్త్రీ పని కోసం మండలంలోని పోసానిపేట్ గ్రామానికి వలస వచ్చాడు. పనికోసం ఆదివారం ఉప్పల్ వాయి గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా పోసానిపేట్ జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తమ్ముడు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

'ప్రజావాణి'కి అధికారుల డుమ్మా

నాగిరెడ్డిపేట, జూలై 8: ప్రభుత్వం స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కచ్చితంగా ప్రజావాణిలో ఆయాశాఖల అధికారులు ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కానీ సోమవారం నిర్వహించిన సమావేశానికి సగం మంది అధికారులు కూడా హాజరుకాకపోవడం గమనార్హం. ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీవో ప్రకాశ్, నీటిపారుదల శాఖ ఏఈ ప్రవీణ్, ఎంఈవో వెంకటేశం, ఏడీఏ వీరస్వామి, మిషన్ భగీరథ ఏఈ విష్ణు, వెటర్నరీ వైద్యుడు రవికుమార్, అటవీశాఖ అధికారులు గైర్హాజరయ్యారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. ప్రజావాణికి జలాల్‌పూర్ గ్రామం నుంచి ఒకరు ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు ఇవ్వగా.. ఎంపీడీవో పర్బన్నకు అందించి వెంటనే పరిష్కరించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

నాగిరెడ్డిపేటలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

ఎల్లారెడ్డిలో దరఖాస్తులు నిల్

ఎల్లారెడ్డి, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. రెండు వారాలుగా ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తులు రావడంలేదు. ప్రతి సోమవారం తహసీల్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరవుతున్నప్పటికీ ఫిర్యాదుదారులు రావడం లేదు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెవెన్యూ శాఖతో పాటు ఇతర ప్రభుత్వం శాఖల అధికారులు కార్యాలయంలో ఉన్నప్పటికీ ఒక్కరు కూడా రాలేదు. దీంతో అధికారులు ఒంటి గంట తరువాత వారి కార్యాలయాలకు వెళ్లిపోయారు. ప్రజావాణి కార్యక్రమానికి ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్ సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, వ్యవసాయ శాఖ అధికారి సంతోష్, ఐకేపీ ఏపీఎం ప్రసన్న రాణి హాజరయ్యారు.

వ్యవసాయ కూలీలకు జీవన భృతిని అమలుచేయాలి

కామారెడ్డి, జూలై 8 : రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ కూలీలకు జీవన భృతిని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయల జీవన భృతిని అమలుచేయాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే కాని డొక్కాడని వ్యవసాయ కూలీలను ఎన్నికల్లో ఓట్ల కోసం వాడుకొని, అధికారం వచ్చిన తర్వాత సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ కూలీలను కార్మికులుగా గుర్తిస్తే పీఎఫ్, ఈఎస్ఐ లాంటి వసతులు అందుతాయని తెలిపారు. వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం కృషి చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, నాయకులు దామోదర్, పరమేశ్, కిశోర్, గోపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు త్వరగా ప్రారంభించాలి

నాగిరెడ్డిపేట, జూలై 8: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాలలో మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని ప్రధానోపాధ్యాయులు, గ్రామ సమాఖ్య అధ్యక్షులకు డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ ప్రవీణ్ సూచించారు. సోమవారం వారు పాఠశాలలను సందర్శించారు. పాఠశాలలో చేపట్టాల్సిన పనులపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలలో మరమ్మతుల కోసం రూ.8.25 లక్షలు, కస్తూర్బా గాంధీ పాఠశాలలో మరమ్మతులకు రూ. 6.5 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, గదుల మరమ్మతులు చేపడుతామని పేర్కొన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వారి వెంట ఏపీఎం జగదీశ్, కస్తూర్బా ఎస్‌వోలు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్, వీణ, శ్రీలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, లక్ష్మి, సీసీ నారాయణ, దత్తు తదితరులు ఉన్నారు.

వర్షాల కోసం పూజలు, జలాభిషేకాలు

బేగంపూర్‌లోని ఆంజనేయుడికి జలాభిషేకం చేస్తున్న రైతులు

లింగంపేట, జూలై 8: మండలంలోని భవానీపేట గ్రామంలో వర్షాల కోసం గ్రామస్తులు సోమవారం పూజలు నిర్వహించారు. వానకాలం ప్రారంభం నుంచి ఇంతవరకూ భారీ వర్షాలు కురవక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురవాలని కోరుతూ గ్రామస్తులు శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో శివ లింగం మునిగిపోయేంత వరకు నీటితో నింపారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు ఆకుల సురేందర్, కత్తూరి కిషన్ పాల్గొన్నారు.

బేగంపూర్‌లో..

పెద్ద కొడప్‌గల్, జూలై 8: వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని బేగంపూర్ గ్రామంలో సోమవారం ఆంజనేయస్వామికి రైతులు జలాభిషేకం నిర్వహించారు. గర్భాలయాన్ని నీటితో నింపారు.

వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని వేడుకున్నారు.వర్షకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించినస్థాయిలో వర్షాలు కురవలేదని, వరుణదేవుడు కరుణించాలని ప్రార్థించినట్లు రైతులు తెలిపారు.


శివాలయానికి బిందెలతో నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, GADHARI SRIDHAR S/o. GADHARI RAJESHWAR (Old name) R/o.H.No.1-70, Velmal Vill, Makloor Mdl, Dist. Nzb,T.S., Changed my name as GADARI SRIDHAR S/o. GADARI RAJESHWAR (New name)
NTZ-324993

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రూ.19.10 లక్షలు పలికిన తైబజార్ వేలం

కామారెడ్డి, జూలై 8 : జిల్లా కేంద్రంలో సోమవారం తైబజార్ వేలం నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తైబజార్ వేలం జూలై 9వ తేదీ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు ఉంటుందని తెలిపారు. ఈ వేలంలో ముగ్గురు సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. అత్యధికంగా చాట్ల శ్రీనివాస్ రూ.19 లక్షల 10 వేలకు వేలంపాడి తైబజార్‌ను దక్కించుకున్నాడని తెలిపారు.

గోపాల్‌పేట తైబజార్..

నాగిరెడ్డిపేట, జూలై 8: మండల కేంద్రంలోని గోపాల్‌పేట తైబజార్ వేలం వేయగా.. గ్రామానికి చెందిన లంబాడి రాము రూ.3.14 లక్షలకు దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. సోమవారం నిర్వహించిన వేలంలో ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇంతకు ముందు రెండు పర్యాయాలు వేలం నిర్వహించగా...నిర్ణయించన ధర రాకపోవడంతో నిలిపివేసినట్లు తెలిపారు. తైబజార్ దక్కించుకున్న వారు తొమ్మిది నెలలపాటు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

నిజాంసాగర్, జూలై 8: నిజాంసాగర్ ఆదర్శపాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఎంఈవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. పాఠశాలలో వంటగది, తాగునీరు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో కార్యాలయ సిబ్బంది రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాదర్శి అజయ్, ఫిర్దోస్, జమీల్, సందీప్, కిశోర్ పాల్గొన్నారు.

స్వీట్ హోంలలో అధికారుల తనిఖీలు

మద్నూర్, జూలై 8: మండలకేంద్రంలోని స్వీట్‌హోంలు, కిరాణా దుకాణాల్లో ఆహార భద్రత అధికారిణులు శిరీష, సునీత సోమవారం తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన ఉత్పత్తులను పారవేశారు. పరిశుభ్రత, ఆహారభద్రత ప్రమాణాలపై వ్యాపారులకు పలు సూచనలు చేశారు. వర్షకాలం నేపథ్యంలో మిఠాయి దుకాణాలవారు జాగ్రత్తలు తీసుకొని, స్వచ్ఛమైన పదార్థాలను విక్రయించాలని సూచించారు. కొన్ని అనుమానిత నమూనాలను సేకరించారు. వాటిని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించి, నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

గుంతలమయమైన రోడ్లు.. ఇబ్బందుల్లో వాహనదారులు

రోడ్డుపై పడిపోయిన బస్తాలు

మద్నూర్, జూలై 8: మండలకేంద్రం నుంచి పెద్దశక్కర్గకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారాయి. సోమవారం పత్తిగింజల బస్తాలను తీసుకెళ్తున్న ఓ లారీ గుంతలో దిగబడడంతో అందులో ఉన్న బస్తాలు కింద పడిపోయాయి. సుమారు వంద బస్తాల వరకు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో 'వన మహోత్సవం'

లింగంపేట/బిచ్కుంద/బాన్సువాడ రూరల్, జూలై 8: మండలంలోని పలు గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమం కొనసాగుతున్నదని ఎంపీడీవో నరేశ్ తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 41 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. సోమవారం ఆయన ఎల్లారం గ్రామంలో పర్యటించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లింగంపేట మండలంలో సుమారు లక్షా 40వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలతో పాటు నివాసాల వద్ద నాటడానికి మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

మండలంలో ఇంతవరకు 46వేల మొక్కలు నాటినట్లు చెప్పారు. బిచ్కుంద మండలంలోని సిర్‌సముందర్‌లో వన మహోత్సవంలో భాగంగా గ్రామ కార్యదర్శి సంజీవ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వివిధ రకాల ఆరు మొక్కలను పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు భూమప్ప, ప్రవీణ్, గంగాధర్ పటేల్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు. బాన్సువాడ మం డలంలోని కొయ్యగుట్ట తండాలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ ప్రత్యేకాధికారి ముజాహిద్ గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి ఇంటింటికీ వెళ్లి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రహేలాబేగం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి సంజీవ్